

## అంజన్నకు మొక్కులు

కొండగట్టు : శ్రీ ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల రద్దీ నెలకొంది. కాగా, చలు వపందిళ్ల కింద బారులు తీరారు.



## రైతులకు రుణాలు

ధర్మపురి : స్థానిక పీఏసీఎస్ ద్వారా రైతులకు రూ.11.20లక్షల రుణాలను డీసీఎమ్మెస్ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి పంపిణీ చేశారు.

## వాతావరణం

గరిష్టం/కనిష్టం
36.0/20.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

## న్యూస్‌రీల్

### వైభవంగా ఏకాంతోత్సవం



శ్రీవేంకటేశ్వరస్వామికి ఏకాంతోత్సవం

**ధర్మపురి:** బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయ ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఉగ్ర నృసింహస్వామి ఆలయంలో పుష్ప యాగం, శ్రీవేకటేశ్వరస్వామికి ఏకాంతోత్సవం వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, వేదపండితుడు బొజ్జ రమేశ్‌శర్మ, ఉప ప్రధాన అర్చకుడు నేరెళ్ల శ్రీనివాసచారి, రెనోవేషన్ కమిటీ చైర్మన్ రామన్న, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

**సారంగాపూర్(జగిత్యాల):** పదో తరగతి విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని స్టేట్ ఎడ్యుకేషన్ రీసెర్చ్ ట్రైనింగ్(ఎస్‌ఈఆర్టీ) రాష్ట్రపరిశీలకుడు సయ్యద్ ఇర్షాద్ అలీ సూచించారు. కోనాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులతో ఆయన మంగళవారం మాట్లాడారు. విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించడానికి ఉపాధ్యాయులు బోధనతోపాటు, మెలకువలను నేర్పించాలన్నారు. ప్రతీ పాఠ్యాంశాన్ని లోతుగా చదివి, పరీక్ష కేంద్రంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా, ప్రశాంతంగా, ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని విద్యార్థులకు సూచించారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు మచ్చ శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### కరాటే పోటీల్లో ప్రతిభ



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగసుధారాణి

**జగిత్యాలరూరల్:** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కండ్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థి శామంత్ అండర్– 14లో కాంస్య పతకం సాధించాడు. పతకం సాధించిన విద్యార్థిని ప్రిన్సిపాల్ నాగసుధారాణి, పీఈటీ వినిత్ కుమార్, కరాటే మాస్టర్ ఎం.శ్రీనివాస్ మంగళవారం అభినందించారు.

### కంటి వెలుగు శిబిరంలో తనిఖీలు



వివరాలు తెలుసుకుంటున్న డాక్టర్ సమియొద్దీన్

**కథలాపూర్(వేములవాడ):** భూషణరావుపేట గ్రామంలో చేపట్టిన కంటివెలుగు శిబిరాన్ని వైద్యశాఖ జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి ఎండీ సమియొద్దీన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. శిబిరంలో ఇప్పటివరకు ఎంతమంది ప్రజలకు కంటి పరీక్షలు చేశారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కంటి వెలుగు కార్యక్రమం గురించి గ్రామంలో విస్తృతంగా ప్రచారం చేస్తే ప్రజలు ఇంకా ఎక్కువగా వస్తారని సిబ్బందికి సూచించారు. అందుకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వీలైనంత వరకు ఎక్కువ మంది నేత్రవైద్య పరీక్షలు చేయించుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ భూషణ్, ఏఎన్‌ఎం గంగలక్ష్మి, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

**జగిత్యాల:** జిల్లావాసులు తమ ఆధార్ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్.లత సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆధార్ సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ, 10ఏళ్ల క్రితం ఆధార్ వివరాలు నమోదు చేసుకున్న ప్రతీపౌరుడు ఇప్పుడు తమ వివరాలన్నీ అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. అదేవిధంగా 5–10ఏళ్ల వయసు దాటిన పిల్లలందరి వివరాలను కూడా అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. ఆధార్ వివరాలు అప్‌డేట్ చేయకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాల్లో ప్రయోజనాలు దక్కవని అన్నారు. జిల్లావాసులు ఈ విషయాన్ని గుర్తించి తక్షణే తమ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మాధురి, డీఎస్పీ రవీందర్ కుమార్, ఎల్‌డీఎం వెంకటరెడ్డి, పాల్గొన్నారు.

# పకడ్బందీగా ఏర్పాట్లు



కోరుట్లలో ఇంటర్ విద్యార్థులకు హాల్‌టికెట్లు పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

### నిర్భయంగా పరీక్షలు రాయండి



వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్ చూపిస్తే పరీక్ష కేంద్రంలోకి అనుమతిస్తాం. ఈ మేరకు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లకు ఆదేశాలిచ్చాం. నిర్దేశిత సమయానికి అనుగుణంగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా సౌకర్యం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు ఉత్తర్వులు జారీచేశాం. విద్యార్థులు హాల్‌టికెట్లు చూపిస్తే ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేసే వీలు కల్పించాం. దీనిని సద్వినియోగం చేసుకోవాలి. అంతేకాదు.. టెన్షన్ లేకుండా పరీక్షలు రాయాలి.

– నారాయణ,
జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి

### నిమిషం ఆలస్యమైతే అనుమతి లేదు

పరీక్షలు ఉదయం 9.00 మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులను గంటముందే పరీక్ష హాల్‌లోకి అనుమతిస్తారు. నిమిషం ఆలస్యమైతే ఎవరినీ అనుమతించరు. 'నిమిషం ఆలస్యమైతే' నిబంధనలపై విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఇప్పటికే అవగాహన కల్పించామని అధికారులు తెలిపారు. గత ఐదేళ్లలో నిమిషం నిబంధన పక్కాగా అమలు చేశామని, దీంతో వందశాతం మంది విద్యార్థులు సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవడం విశేషమని జిల్లా అధికారులు వివరించారు. కాగా, ప్రతీ పరీక్ష కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు.

- నేటినుంచి ఇంటర్ వార్షిక పరీక్షలు
- 29 కేంద్రాలు.. 15,972 మంది విద్యార్థులు
- గంట ముందుగానే పరీక్ష కేంద్రంలోకి అనుమతి
- ఈసారి కూడా నిమిషం ఆలస్యమైతే 'నో ఎంట్రీ'

**జగిత్యాల/కథలాపూర్(వేములవాడ):** జిల్లాలో బుధవారం ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు ఇంటర్ ప్రథమ, రెండోరోజు గురువారం నుంచి ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహిస్తారు. ఏప్రిల్ ఒకటో తేదీ వరకు రోజూ ఉదయం 9.00 – మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. ఇందుకోసం అన్నిఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఇంటర్ విద్య నోడల్ అధికారి నారాయణ వివరించారు. పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు, అక్రమాలను అరికట్టేందుకు రెండు ఫ్లయింగ్ స్క్వాడ్స్, ముగ్గురు సిట్టింగ్ స్క్వాడ్స్ పర్యవేక్షించేలా చర్యలు తీసుకున్నామన్నారు.

**15,972 మంది విద్యార్థులు.. 29 కేంద్రాలు..**

- విద్యార్థుల కోసం జిల్లాలో 29 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు.
- జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలు మొత్తం 71 ఉన్నాయి.
- ఫస్టియర్ 7,389 మంది, సెకండియర్ 8,583 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని విద్యాశాఖ అధికారులు తెలిపారు.
- పరీక్షల నిర్వహణకు 400 మంది సిబ్బంది సేవలు వినియోగించుకుంటున్నట్లు అధికారులు పేర్కొన్నారు.
- విద్యార్థులకు సౌకర్యంగా ఉండేందుకు పరీక్ష కేంద్రాల్లో డెస్కులు, బెంచీలు, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

**వైద్య, పోలీసు అధికారుల సహకారం..**

- పరీక్షలు సజావుగా నిర్వహించాలని, పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఇబ్బందులు కలగవద్దని విద్యాశాఖతోపాటు వైద్య, పోలీస్ అధికారుల సహకారం తీసుకుంటున్నారు.
- ప్రతీపరీక్ష కేంద్రంలో ప్రాథమిక చికిత్స అందించేలా ఏఎన్‌ఎంతోపాటు ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచుతారు.
- అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేయించారు.

# హతులెవరు.. హంతకులెవరు?

- మృతులు మహిళనా, పురుషుడా?
- మృతదేహాన్ని ముక్కలు చేశారా?
- కుక్కలు పీక్కుతిన్నాయా?
- డాగ్‌స్క్వాడ్‌తో పోలీసుల తనిఖీలు
- దర్యాప్తు ముమ్మరం చేసిన అధికారులు

**జగిత్యాలక్రైం:** నేరాల సంఖ్య పెరుగుతోంది. సాంకేతిక సాయంతో నేరస్తులను పట్టుకోవడం పోలీసులకూ సులభమవుతోంది. అయితే, పోలీసుల నుంచి తప్పించుకునేందుకు నేరస్తులు కూడా అనేక మార్గాలు ఎంచుకుంటున్నారు. ఇలాంటి ఘటనే జిల్లాలోని మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారులో చోటుచేసుకుంది. ఓ వ్యక్తిని చంపి, ముక్కలుగా నరికి.. ఆపై ఆధారాలు లేకుండా కాల్చివేశారనే అనుమానాలు ఉన్నాయి. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, డాగ్ స్క్వాడ్, మృతదేహాన్ని దహనం చేసిన ప్రదేశం(ఎడమవైపు)

**రోడ్డుకు వంద మీటర్ల దూరంలోనే..**

- మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారులోని కొండగట్టు దిగువ ప్రాంతాన జగిత్యాల–కరీంనగర్ ప్రధాన రహదారికి సుమారు 100 మీటర్ల దూరంలో చెత్తడంప్ ఉంది.
- దాఆపు రెండుమూడ్రోజుల క్రితం ఓ వ్యక్తిని ఎక్కడో హత్యచేసి ఇక్కడి చెత్తడంప్ యార్డులో పడేశారని అనుమానిస్తున్నారు.
- పెట్రోల్‌పోసి గుర్తుపట్టడానికి వీలులేకుండా మృతదేహాన్ని కాల్చివేశారు.
- అంతకుముందే మృతదేహాన్ని ముక్కలుగా చేశారని తెలుస్తోంది.
- అయితే, సగం కాలిన శరీర భాగాలను కుక్కలు పీక్కుతిన్నాయి.
- మరికొన్ని అక్కడక్కడా పడవేశాయి.
- మంగళవారం ఉదయం వ్యవసాయ పనుల కోసం అటుగా వెళ్తున్న రైతులకు చెత్తడంప్ వద్ద దుర్వాసన వచ్చింది.
- అక్కడకు వెళ్లి చూడగా మనిషి శరీర భాగాలు కనిపించాయి.
- వెంటనే వారు మల్యాల పోలీసులకు సమాచారం అందించారు.
- మల్యాల సీఐ రమణమూర్తి, కొడిమ్యాల ఎస్సై వెంకట్రావ్ తమ సిబ్బందితో వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు.
- డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు ప్రారంభించారు. నిపుణులు ఫింగర్ ప్రింట్స్ సేకరించారు.
- హంతకులు మృతదేహాన్ని కాల్చివేశాక ముక్కలుగా మారాయా? లేక కుక్కలు పీక్కు తినడంతో మృతదేహం ముక్కలైందా? అనే అనుమానాలు పోలీసులు వ్యక్తం చేస్తున్నారు.
- వైద్యబృందం రంగంలోకి దిగి శరీర భాగాలు సేకరించి బ్యాగుల్లో చేర్చి పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించింది.
- అయితే, మృతదేహం మహిళదా, లేక పురుషుడిదా? అనేది గుర్తుపట్టలేకుండా ఉందని పోలీసులు చెబుతున్నారు.
- పరీక్షలు పూర్తయ్యాక ఒకట్రెండు రోజుల్లో మృతదేహం మహిళదా, పురుషుడిదా, వయసు ఎంత? అనే విషయాలు తేలుస్తామని వైద్యసిబ్బంది స్పష్టం చేస్తున్నారు.
- మరోవైపు.. సమీపంలోని సీసీ కెమెరాల పుటేజీలు, సాంకేతిక పరిజ్ఞానంతో పోలీసులు లోతైన విచారణ ప్రారంభించారు.



శరీర భాగాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

### పోలీసులకు తలనొప్పి..

- మల్యాల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంటున్న నేరాలు పోలీసులకు తలనొప్పి తెచ్చిపెడుతున్నాయి.
- గత ఫిబ్రవరి 24న వేకువజామున కొండగట్టు శ్రీఆంజనేయస్వామి ఆలయంలోభారీచోరీ జరిగింది.
- ఇది రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది.
- ఈ చోరీని సవాల్‌గా తీసుకున్న పోలీసులు సుమారు పదిరోజుల్లోనే కొందరు దొంగలను పట్టుకున్నారు.
- ఇటీవల ఆలయ వసతి గృహాల్లో భక్తుల నుంచి కొంత నగదు, మొబైల్ ఫోన్లు అపహరణకు గురయ్యాయి.
- వీటి దొంగలనూ పోలీసులు 24గంటల్లో పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.
- ఈ నేరాలు మర్చిపోకముందే మత్యంపేట శివారులోని చెత్తడంప్‌లో ఓ మృతదేహం ముక్కలుగా లభించడం, దానిని కాల్చివేయడం, అక్కడక్కడా ముక్కలు ముక్కలుగా లభించడం.. శవాన్ని గుర్తుపట్టేందుకు రంగంలోకి దిగడం, దర్యాప్తు వేగిరం చేయడం పోలీసులకు తలనొప్పిగా మారింది.

**మిస్సింగ్ కేసులపై ఆరా..**

- మరోవైపు.. జిల్లాలోని వివిధ పోలీసుస్టేషన్లలో నమోదైన మిస్సింగ్ కేసులపై పోలీసులు ఆరా తీస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే అన్ని ఠాణాలకు పోలీసు ఉన్నతాధికారులు ఆదేశాలు జారీచేశారు. ఇదేకోణంలోనూ వారు దర్యాప్తు వేగవంతం చేశారు.

# కలెక్టర్ టీచర్ అయిన వేళ..

- విద్యార్థులకు పాఠాలు బోధించి..
- ప్రశ్నలకు సమాధానాలు రాబట్టి..
- ఉత్సాహం నింపిన యాస్మిన్‌బాషా



తరగతి గదిలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ యాస్మిన్‌బాషా

**కొడిమ్యాల(చొప్పదండి):** కలెక్టర్ యాస్మిన్ బాషా మంగళవారం కాసేపు ఉపాధ్యాయురాలిగా మారిపోయారు. మన ఊరు.. మనబడి కార్యక్రమంలో భాగంగా జగిత్యాల జిల్లా కొడిమ్యాల జెడ్పీ హైస్కూల్లో చేపట్టిన పనులు పరిశీలించారు. పదో తరగతి గదిలోకి వెళ్లి ఫిజిక్స్, బయాలజీ తదితర పాఠ్యాంశాలపై విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. అయితే, బాలికల నుంచి సరైన సమాధానాలు రాగా, బాలురుల నుంచి ఆశించిన స్పందన కనిపించలేదు. వారు చదువులో వెనుకబడడానికి గల కారణాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఇలాంటి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా బోధన చేయాలని సూచించారు. ఏకాగ్రతతో అభ్యసనం చేయాలని, చదువు ద్వారానే సమస్యలను పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని చెప్పారు. మధ్యాహ్న భోజన పథకంలో భాగంగా వండిన వంటలను తనిఖీ చేశారు. మన ఊరు.. మనబడి పనులు ఇంకా పూర్తికాకపోవడానికి గల కారణాల గురించి ఏఈ, డీఈలను ప్రశ్నించారు. గతంలో నిర్వహించిన పనులకు బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు నిలిచిపోయాయని కాంట్రాక్టర్ తెలిపారు.

**మహిళలను చైతన్య పర్చాలి**

అనంతరం స్థానిక పీహెచ్‌సీలోని ఆరోగ్య మహిళా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీచేశారు. మహిళల ఆరోగ్య సమస్యల పరిష్కారం కోసం కొడిమ్యాల, నేరెళ్ల, ఐలాపూర్, కథలాపూర్, జగిత్యాల అర్బన్ పీహెచ్‌సీల్లో ప్రతీ మంగళవారం ఆరోగ్య మహిళా కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. బ్రెస్ట్, సర్వైకల్ క్యాన్సర్, అధిక బరువు, మెనోపాజ్, పీసీవోడీ, లైంగిక వ్యాధుల నిర్ధారణ పరీక్షలను ఇందులో నిర్వహిస్తారని, మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిజేరియన్లను తగ్గించి సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యులకు సూచించారు. డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఆమెకు 'సఖి' అండ

- వేధింపులపై సత్వర స్పందన
- సమస్యల పరిష్కారానికీ ప్రత్యేక చొరవ
- నిపుణులతో న్యాయ సలహాలు, సూచనలతో కౌన్సెలింగ్
- బాధిత మహిళల సేవలో సఖి కేంద్రం

**జగిత్యాల:** ఇంటా, బయటా అనేక వేధింపులు, లైంగికదాడులు, ఇతర సామాజిక సమస్యలతో బాధపడే వారికి జిల్లా కేంద్రంలోని సఖి కేంద్రం అండగా నిలుస్తోంది. మహిళాశిశు సంక్షేమ శాఖ, స్వచ్ఛంద సంస్థ, ప్రకృతి పర్యావరణ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో 26 ఏప్రిల్ 2019లో జగిత్యాలలో సఖి సెంటర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇది 24గంటల పాటు బాధిత మహిళలకు అండగా నిలుస్తోంది. గృహహింస, పనిచేసేచోట, విద్యాసంస్థల్లో లైంగిక వేధింపులు, అత్యాచారాలు, మహిళలు, బాలికలు, యువతుల అక్రమ రవాణా, యాసిడ్ దాడులు తదితర సమస్యల్లో చిక్కుకున్న వారికి మేమున్నామంటూ అక్కున చేర్చుకుంటోంది.

**ఇవీ సఖి సేవలు..**

- **వైద్యం :** గృహహింస, ఇతర వేధింపుల్లో గాయాలకు గురైతే ఆస్పత్రిలో చేర్పించి వైద్యసాయం అందిస్తోంది.
- **సైకో సోషల్ కౌన్సెలింగ్ :** బాధితురాలి విన్నపం మేరకు నిందితులకు కౌన్సెలింగ్ ఇచ్చి, సమస్య పరిష్కరిస్తోంది.
- **లీగల్ కౌన్సెలింగ్ :** కౌన్సెలింగ్ ద్వారా సమస్య పరిష్కారం కాకుంటే న్యాయ సలహాలు, సూచనల కోసం డీఎల్‌ఎస్‌ఏను సంప్రదిస్తోంది.
- **పోలీసు సాయం :** చాలాహింసలతో బాధపడుతూ, సఖి కేంద్రానికి రాలేని పరిస్థితుల్లో ఉన్న మహిళలకు పోలీసు రక్షణ కల్పిస్తోంది.
- **వసతి :** బాధితురాలు విన్నపం మేరకు ఒకటి నుంచి ఐదురోజుల వరకు సఖి కేంద్రంలోనే ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. బాధితుల వివరాలు గోప్యంగా ఉంచుతున్నారు.

**ప్రచారం.. విస్తృతం..**

గ్రామాలు, పట్టణాల్లో బాధిత మహిళలు తమపై జరిగిన వేధింపులు, అఘాయిత్యాలు, లైంగిక దాడుల గురించి ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడంలేదు. ఇలాంటి వారికి సఖి కేంద్రం అండగా ఉంటుందనే విషయంపై అవగాహన కల్పించేందుకు అన్నిచోట్ల అవగాహన కార్యక్రమాలు చేపడుతోంది. ఇలా ఇప్పటిదాకా 368 సభలు, సమావేశాలు, సదస్సులు నిర్వహించింది. సఖి సేవలు, చట్టాల అండగ తదితర అంశాలపై వివరించింది. పాఠశాలలు, కళాశాలలు, ఆరోగ్య కేంద్రాలు, మండల, జిల్లా సమాఖ్యలు.. ఇలా మహిళలు ఉండే ప్రతీచోట అవగాహన కల్పిస్తున్నారు. అంగన్‌వాడీ టీచర్లు, ప్రిన్సిపాల్స్ సహకారంతోనూ ప్రచారం చేస్తున్నారు.



మహిళలకు కౌన్సెలింగ్ ఇస్తున్న సఖి నిర్వాహకురాలు

**181 నంబర్‌కు కాల్ చేస్తే చాలు..**

బాధితులు ఎవరైనా టోల్‌ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేసి సమాచారం అందిస్తే సఖి కేంద్రం తక్షణమే స్పందిస్తోంది. ల్యాండ్‌లైన్ నంబర్ 08724–295235ను కూడా సంప్రదించే వీలు కల్పించారు. 24 గంటల పాటు నిర్వాహకులు అందుబాటులో ఉంటున్నారు. బాధితుల వివరాలు పూర్తి గోప్యంగా ఉంచుతున్నారు.

**మహిళలకు అండ..**

సఖి కేంద్రం ప్రారంభం నుంచీ బాధిత మహిళలకు అండగా నిలుస్తోంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లైంగిక, మానసిక వేధింపులకు గురవుతున్న వారిలో మనోనిబ్బరం కల్పిస్తోంది. భవిష్యత్‌పై బెంగ లేకుండా చేస్తూ తాము అండగా ఉంటామని భరోసా కల్పిస్తోంది.

| అందించిన సేవలు | |
|---|---|
| సైకో సోషల్ కౌన్సెలింగ్ | 802 |
| లీగల్ కౌన్సెలింగ్ | 469 |
| తాత్కాలిక వసతి | 363 |
| పోలీసు భద్రత | 168 |
| వైద్యసేవలు | 86 |
| స్వధార్‌కు పంపించినవారు | 20 |
| ఇతర గృహాలకు పంపించినవారు | 7 |

**సఖి కేంద్రంలోని కేసుల వివరాలు**

2021 నుంచి 2023 ఫిబ్రవరి 28 వరకు

| | |
|---|---|
| నమోదైనవి | 1328 |
| ప్రగతిలో ఉన్నవి కేసులు | 615 |
| పరిష్కరించినవి | 713 |
| గృహహింస | 865 |
| సైబర్‌క్రైం, ప్రేమ వివాహాలు, చీటింగ్ | 103 |
| మిస్సింగ్, కిడ్నాప్ | 81 |
| బాల్య వివాహాలు | 6 |
| వరకట్నం | 23 |
| పోక్సో | 10 |
| యాసిడ్ దాడి | 1 |
| లైంగిక దాడి | 12 |
| 181 హెల్ప్‌ద్వారా నమోదైనవి | 386 |
| ఇతర | 227 |

### అందుబాటులో ఉంటాం



181 నంబరు ద్వారా సఖి కేంద్రానికి ఫోన్‌చేసి తమ సమస్యలు వివరిస్తే బాధితులకు తక్షణ సాయం అందిస్తాం. ఇందుకోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటాం. బాధిత మహిళలు, బాలికలు, యువతులకు అండగా ఉంటాం.

– మనీల, సఖి అడ్మినిస్ట్రేటర్

### బాధితులకు అండ



జగిత్యాలలోని సఖి కేంద్రాన్ని అన్ని ప్రాంతాలు, రంగాల మహిళలు సద్వినియోగం చేసుకోవచ్చు. బాధితులు ఎవరైనా అండగా ఉంటాం. జిల్లావాసులకు ఇప్పటి వరకు 368 వరకు అవగాహన సదస్సులు, సమావేశాలు నిర్వహించాం.

– జయశ్రీ, సఖి సీఈవో

### అతివలకు ఆసరా



వరకట్న వేధింపులు, అత్యాచార బాధితులు, వ్యభిచార కొంపల్లో మగ్గుతున్న, నిరాదారణకు గురైన మహిళలకు సఖి కేంద్రం ఆసరాగా నిలుస్తోంది. మంత్రి, ప్రజాప్రతినిధులు, కలెక్టర్ సహకారంతో అభాగ్యులకు అండగా ఉంటోంది.

– హరి అశోకుమార్, సఖి గౌరవ సలహాదారు

## క్లుప్తంగా

### లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారుల ఎంపిక

జగిత్యాల: తెలంగాణ రాష్ట్ర అల్పసంఖ్యాక వర్గాల ఆర్థిక సంస్థ ద్వారా 2022-23 సంవత్సరానికి ఆర్థికసాయం, సబ్సిడీ పొందాలనుకునే జగిత్యాల పరిధిలోని మైనారిటీ అభ్యర్థులు ఆన్‌లైన్‌లో లక్ష్యాన్ని మించి దరఖాస్తు చేసుకున్నారని మెప్మా పీడీ బోనగిరి నరేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ నెల 16న ఉదయం 11 గంటలకు శ్రీరామ థియేటర్ వద్ద గల పాత మెప్మా కార్యాలయంలో దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. అందరూ సకాలంలో హాజరు కావాలని సూచించారు.

### గణితం సులభంగా నేర్చుకోవచ్చు


మాట్లాడుతున్న గంగాధర్

జగిత్యాల: అబాకస్ ద్వారా విద్యార్థులు సులభంగా గణితం నేర్చుకోవచ్చని అబాకస్ నిపుణుడు గంగాధర్ అన్నారు. మంగళవారం నర్సింగాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అబాకస్‌పై శిక్షణనిచ్చారు. విద్యార్థులు గణితం అంటే భయపడవద్దని, పెన్సిల్, పెన్ను లేకుండా చేతివేళ్లపై అలవోకగా గణిత సమస్యలు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పిల్లల వైద్య నిపుణుడు అమిత్‌కుమార్, అన్నపూర్ణ ట్రస్ట్ కన్వీనర్ శ్రీకాంత్, కొమురయ్య, సర్పంచ్ సరోజ, ఎంపీటీసీ సభ్యుడు మహేశ్, హెచ్ఎం రాజేశ్వర్‌రావు, ఉపాధ్యాయులు స్వప్న, ప్రియ, శ్రీనివాస్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన పథకంలో ప్రవేశపెట్టిన అసిస్టెంట్ సర్వేయర్, డొమెస్టిక్ డాటాఎంట్రీ ఆపరేటర్- షార్ట్‌టర్మ్ (రెండు నెలల వ్యవధి) కోర్సులు ఏప్రిల్ 1 నుంచి ప్రారంభమవుతాయని, ఆసక్తిగల విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎస్.కవిత తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై, ఐటీఐ మధ్యలో ఆపేసిన విద్యార్థులు, మధ్యలో బడి మానేసిన 16 - 45ఏళ్ల వయసు గలవారు అర్హులన్నారు. ఆసక్తి గలవారు ఆధార్, స్టడీ సర్టిఫికెట్, బ్యాంక్ పాస్‌బుక్, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో ఈనెల 20లోగా ఐటీఐలో సంప్రదించాలని సూచించారు.

### రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీల్లో ప్రతిభ



సారంగాపూర్(జగిత్యాల): స్థానిక కస్తూరిబా బాలికల గాంధీ బాలికల విద్యాలయం నుంచి పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కిక్‌బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో నిత్య, రిషిత, సాహితి, వర్ష గోల్డ్ మెడల్స్, ప్రణీత, భువన, మౌనిక, భానుశ్రీ, శివాణి సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరు ఏప్రిల్ 29, 30 తేదీల్లో మంచిర్యాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ప్రియదర్శిని, ఉపాధ్యాయులు అభినందించారు.

## మాస్టర్ ప్లాన్ అమలుకు.. అడుగడుగునా అడ్డంకులే!

- రైతుల ఆందోళనలతో రద్దు చేస్తున్నట్లు ప్రకటించిన మున్సిపల్ కార్యవర్గం
- ఇరుకైన రోడ్లు, పార్కింగ్ సమస్యలతో ప్రజల ఇబ్బందులు
- జగిత్యాల పట్టణంలో పరిస్థితి


ఇటీవల కొత్తగా రూపొందించిన మాస్టర్ ప్లాన్

జగిత్యాల: మున్సిపాలిటీలో మాస్టర్ ప్లాన్ అమలుకు అడుగడుగునా అడ్డంకులే ఎదురవుతున్నాయి. 1983లో ఏర్పాటు చేసిన ప్లాన్ జగిత్యాల జిల్లా కేంద్రమైనా కొనసాగుతోంది. మాస్టర్ ప్లాన్ అమలు కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించారు. ప్రభుత్వం కొన్ని గ్రామాలను మున్సిపాలిటీల్లో విలీనం చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మాస్టర్ ప్లాన్ అమలులోకి వస్తుందనుకుంటే రద్దయింది. మళ్లీ ప్రభుత్వం మున్సిపల్‌లో కొత్త ప్లాన్ అమలుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. పబ్లిక్ నోటిఫికేషన్ సైతం ఇచ్చారు. రహదారుల విస్తరణ, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, వాహనాల పార్కింగ్, ఇండస్ట్రియల్ కారిడార్, జోన్ల గుర్తింపు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను గుర్తించారు. కానీ ఇందులో రైతులకు చెందిన భూములను రిక్రియేషన్ జోన్‌లో చేర్చడం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రైతులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయడంతో కౌన్సిల్ ఏర్పాటు చేసి, ప్రస్తుతం మాస్టర్ ప్లాన్ నిర్ణయాన్ని రద్దు చేస్తున్నట్లు తీర్మానం చేశారు. దీంతో అన్నదాతలు కొంతవరకు శాంతించారు. కానీ మళ్లీ ఇప్పుడిప్పుడే పూర్తిస్థాయిలో రద్దు చేయాలని ఆందోళనలు మొదలవుతున్నాయి.

**2041 అవసరాలకు అనుగుణంగా..**

అధికారులు 2041 అవసరాలకు అనుగుణంగా మున్సిపల్ మాస్టర్ ప్లాన్ రూపొందించారు. జగిత్యాలకు 1985లోనే రెండో గ్రేడ్ హోదా లభించగా 2009లో గ్రేడ్-1 మున్సిపల్‌గా అవతరించింది. దాదాపు 35 వేల నివాసాలు ఉండగా 10 కి.మీ విస్తీర్ణంలో విస్తరించి ఉంది. పట్టణ విస్తీర్ణం నివాసాలు రెట్టింపు కావడంతో తెలంగాణ మున్సిపల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు కింద మాస్టర్ ప్లాన్‌కు ఎంపికైంది. మాస్టర్ ప్లాన్ ముసాయిదాను ప్రభుత్వం జీవో నంబర్ 238 ద్వారా డిసెంబర్ 22న జారీ చేసింది. డిసెంబర్ 31 నుంచి ఫిబ్రవరి 28 వరకు ప్రజల నుంచి సూచనలు అందజేయాలని కోరింది.

**ఆందోళనలు ఉధృతం..**

ముసాయిదా మాస్టర్ ప్లాన్‌పై రైతుల నిరసనలు కొనసాగడం, మాస్టర్ ప్లాన్ ఫ్లెక్సీలను తగలబెట్టడం, రోడ్లపై ఆందోళనలు చేపట్టారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం వారికి మద్దతుగా నిలిచారు. దీంతో ఎమ్మెల్యే, మున్సిపల్ కార్యవర్గం సమావేశమై, మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

**జగిత్యాల పట్టణ పరిధిలోనే?**

ముసాయిదాపై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినప్పటికీ గతంలో విలీన గ్రామాల్లో ఆలస్యం జరగగా ప్రస్తుతం రైతుల గొడవతో జగిత్యాల మున్సిపల్ మాస్టర్ ప్లాన్ అమలు ముందుకుసాగడం లేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ విషయంలో కనీసం పట్టించుకోవడం లేదన్న ఆరోపణలున్నాయి. ఒకవైపు జిల్లా కేంద్రం కావడం, శరవేగంగా అభివృద్ధి చెందుతుండటంతో మాస్టర్ ప్లాన్ లేక ఇరుకైన రోడ్లు, పార్కింగ్, ఇండస్ట్రియల్ కారిడార్, ఎడ్యుకేషన్ ఏరియాలు, లేఅవుట్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. రైతుల ఆందోళనల నేపథ్యంలో జగిత్యాల పట్టణ పరిధిలోనే మాస్టర్ ప్లాన్ చేపట్టాలని వినతులు వస్తున్నాయి. కొత్త మాస్టర్ ప్లాన్ రూపొందిస్తే చాలా రోజుల సమయం పట్టే అవకాశాలున్నాయి.

## పంటలు ఎండితే అధికారులదే బాధ్యత

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాల్లో పొలాల పరిశీలన


పొలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): పంటలు ఎండిపోతున్నాయని, దీనికి నీటిపారుదలశాఖ ఇంజినీరింగ్ అధికారులే బాధ్యత వహించాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం సారంగాపూర్ మండలంలోని బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాల్లో ఎస్సారెస్పీ కింద ఎండిపోతున్న పంటలను ఆయన పరిశీలించారు. బట్టపల్లిలో చీటి రమణారావు అనే రైతుకు చెందిన ఆరెకరాల వరి పొలం పూర్తిగా ఎండిపోవడంతో వెళ్లి, చూశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద డి-53..12 ఎల్, 1ఆర్ కాలువ ద్వారా బట్టపల్లి, పోతారం, సారంగాపూర్ గ్రామాల్లోని పంటలకు సాగునీరు అందాల్సి ఉందన్నారు. ఇప్పటికీ బట్టపల్లి రైతుల పొలాలకు చుక్క నీరు చేరకపోవడంతో లక్షల రూపాయలు నష్టపోయారని తెలిపారు. 150కి పైగా ఎకరాల్లో వరి పంట ఎండిపోతుందని పేర్కొన్నారు. దీనికి పూర్తి బాధ్యత నీటిపారుదల శాఖ అధికారులదేనని అన్నారు. ఈ మూడు గ్రామాల సమస్యను ఫోన్‌లో సీఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ నారాయణరెడ్డి, డీఈ చక్రూనాయక్‌లకు వివరించారు. డీఈ అక్కడికి చేరుకొని, నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. డి-53 కాలువ ద్వారా సారంగాపూర్, బీర్‌పూర్, ధర్మపురి మండలాలకు సాగునీరు అందాల్సి ఉండగా అధికారులు ఒక్క ధర్మపురి వైపే 250 క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారని ఆరోపించారు. దీనివల్ల తమ పంట పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం అందరూ కలిసి కాలువలో నీరు ప్రవహించేలా చెత్తాచెదారం, మట్టి తొలగింపు పనులు చేపట్టారు. నాయకులు కోండ్ర రామచంద్రారెడ్డి, కొక్కు గంగారాం, ఏలూరి రాజు, కర్నె అంజన్న, వురుమల్ల నగేష్‌రెడ్డి, కాలగిరి మధు, కాలగిరి సత్యంరెడ్డి తదితరులున్నారు. ఎమ్మెల్సీ తుంగూర్ గ్రామంలో ఎల్లమ్మ పట్నాల కార్యక్రమంలో పాల్గొని, పూజలు చేశారు.

## బుగ్గారంలో డీఎల్‌పీవో విచారణ

- పంచాయతీ రికార్డులు సీజ్
- పలువురి వాంగ్మూలం సేకరణ
- కలెక్టర్‌కు నివేదిస్తామని వెల్లడి


డీఎల్‌పీవోకు వాంగ్మూలం ఇస్తున్న గంగారెడ్డి

బుగ్గారం(ధర్మపురి): బుగ్గారం గ్రామపంచాయతీలో పెద్ద ఎత్తున నిధులు దుర్వినియోగం అయ్యాయని ఆరోపిస్తూ గ్రామాభివృద్ధి కోర్ కమిటీ అధ్యక్షుడు చుక్క గంగారెడ్డి గత సెప్టెంబర్‌లో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మెట్‌పెల్లి డీఎల్‌పీవో శ్రీనివాస్ మంగళవారం జీపీ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పలువురు వార్డు సభ్యుల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అలాగే పంచాయతీ రికార్డులను పరిశీలించి, సీజ్ చేశారు. కలెక్టర్‌కు సమగ్ర నివేదిక అందిస్తామని తెలిపారు. జీపీలో విచారణ విషయాన్ని తమకు చెప్పలేదని కొందరు వార్డు సభ్యులు డీఎల్‌పీవో దృష్టికి తీసుకువచ్చారు. అయితే ఇది మూడోసారి విచారణ అని, ఈసారైనా ఫలితం ఏమిటన్నది తేలుతుందో లేదోనని ప్రజలు చర్చించుకుంటున్నారు. ఇప్పటికైనా నిజానిజాలు నిగ్గుతేల్చాలని కోరుతున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుచేందర్, సర్పంచ్ మూల సుమలత, ఉప సర్పంచ్ నగునూరి రామకృష్ణ, ఎంపీవో అఫ్జల్‌మియా, పంచాయతీ కార్యదర్శి నరేందర్ తదితరులు పాల్గొన్నారు. విచారణ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై అశోక్ ఆదేశాల మేరకు ఏఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

### 7 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


పట్టుకున్న బియ్యంతో అధికారి

జగిత్యాలక్రైం: కలెక్టర్ యాస్మిన్ బాషా ఆదేశాల మేరకు జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు మంగళవారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో తనిఖీలు చేపట్టారు. అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక గంగిరెద్దుల కాలనీలో టేకుమల్ల భూలచ్చయ్య ఇంట్లో నిల్వ ఉంచిన 7 క్వింటాళ్ల బియ్యాన్ని సీజ్ చేసి, యజమానిపై 6ఏ కేసు నమోదు చేసినట్లు పౌరసరఫరాల శాఖ అధికారి చందన్‌కుమార్ తెలిపారు. పట్టుకున్న బియ్యాన్ని మండలంలోని రేషన్ డీలర్ తిరునగిరి వేణుగోపాల్ వద్ద భద్రపర్చినట్లు పేర్కొన్నారు. రేషన్ దుకాణం నుంచి లబ్ధిదారులు తీసుకున్న బియ్యాన్ని ఎవరు కొనుగోలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఉద్యోగి మృతి


రాంసింగ్ (ఫైల్)

జగిత్యాల క్రైం: జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో పని చేస్తున్న షరాఫ్ రాంసింగ్(49) మంగళవారం జగిత్యాలలోని తన ఇంట్లోనే కుప్పకూలి, మృతిచెందాడు. గత కొంతకాలంగా ఆయన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ ఉద్యోగిగా పని చేస్తున్నాడు. రాంసింగ్ మృతికి సబ్ రిజిస్ట్రార్ కిషన్‌నాయక్, డాక్యుమెంట్ రైటర్లు రమేశ్, రామకృష్ణ, దామోదర్‌రెడ్డి, అశోక్, శంకర్‌రావు, మోహన్‌రావు, రాజశేఖర్ సంతాపం వ్యక్తం చేశారు.

### అత్తింటివారిపై వరకట్న వేధింపుల కేసు

సారంగాపూర్(జగిత్యాల): అదనపు వరకట్నం కోసం ఓ వివాహితను వేధిస్తున్న ఆమె భర్త, అత్త, మామ, ఆడబిడ్డలపై సారంగాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై మనోహర్‌రావు కథనం ప్రకారం.. రేచపల్లి గ్రామానికి చెందిన యువతికి ధర్మారం మండలంలోని పత్తిపాక గ్రామానికి చెందిన సుంకరి మధుకర్‌తో ఏడాదిన్నర క్రితం వివాహం జరిగింది. పెళ్లి సమయంలో యువతి కుటుంబసభ్యులు ఒప్పుకున్న కట్నకానుకలు ముట్టజెప్పారు. ఈ క్రమంలో కొంతకాలంగా మధుకర్ అదనపు కట్నం తీసుకురావాలని తన భార్యను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడు. బాధితురాలు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు మధుకర్‌తోపాటు బాధితురాలి అత్త శారద, మామ ఆదిరెడ్డి, ఆడబిడ్డ శిరిషలపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

### విద్యుత్ చౌర్యం కేసులో ఒకరికి జరిమానా

జగిత్యాలక్రైం: సారంగాపూర్ మండలంలోని అర్పపల్లికి చెందిన వడ్లాపురం రాములుకు విద్యుత్ చౌర్యం కేసులో రూ.17,244 జరిమానా విధిస్తూ జగిత్యాల మొదటి అదనపు వీరయ్య తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. రాములు 2014లో విద్యుత్ చౌర్యానికి పాల్పడగా మొదటి నేరం కింద రూ.వెయ్యి జరిమానా విధించారు. 2016లో రెండోసారి విద్యుత్ చౌర్యానికి పాల్పడగా విజిలెన్స్ పోలీసులు కేసు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. మంగళవారం జగిత్యాల మొదటి అదనపు న్యాయమూర్తి విచారణ జరిపి, రాములు నేరస్తుడని తేల్చారు. ఆయన రూ.17,244 జరిమానా చెల్లించాలని, లేనిపక్షంలో మూడు నెలల జైలుశిక్ష అనుభవించాలని తీర్పునిచ్చారు. ఈ కేసులో సాక్షులను విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కె.స్వామి ప్రవేశపెట్టారు.

### ధర్మపురి వాసికి గుర్తింపు


జ్ఞాపిక అందుకుంటున్న చినరామకిష్టయ్య

ధర్మపురి: బాల సాహిత్యంలో ఉన్నత సేవలు అందించిన పట్టణవాసి సంగనభట్ల చినరామకిష్టయ్యకు అరుదైన గుర్తింపు లభించింది. రిటైర్డ్ ఉపాధ్యాయుడు, సాహితీవేత్త చినరామకిష్టయ్య బాల సాహిత్యంలో 23ఏళ్లకు పైగా 700కుపైగా రచనలు, కథలు రాశారు. దీనిని గుర్తించిన చెన్నైలోని బాల సాహిత్య అకాడమీ ఈనెల 12న చెన్నైలో 'తెలుగు.. వెలుగు' బిరుదుతోపాటు జ్ఞాపిక అందజేశారు. తెలుగు.. వెలుగు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

### కుల బహిష్కరణపై జయవరంలో విచారణ


విచారణ చేపడుతున్న డీఎస్పీ నాగేంద్రచారి

వేములవాడరూరల్: వేములవాడ మండలంలోని జయవరం గ్రామానికి చెందిన సార శ్రీనివాస్‌గౌడ్ అదే గ్రామానికి చెందిన 11 మంది గౌడ కులస్తులు తనను కుల బహిష్కరణ చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇటీవల గ్రామంలో జరిగిన ఎల్లమ్మ ఆలయ నిర్మాణ పూజా కార్యక్రమానికి తనను పిలవలేదని చెప్పాడు. ఈ మేరకు వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి మంగళవారం గ్రామానికి వెళ్లి, గ్రామస్తులు, కుల పెద్దల మధ్య విచారణ చేపట్టారు. నిందితులు 11 మందిపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్సై నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

### లింగంపేటలో వ్యక్తి అదృశ్యం


లక్ష్మీపతి

చందుర్తి(వేములవాడ): మండలంలోని లింగంపేటకు చెందిన దర్శనాల లక్ష్మీపతి అదృశ్యమైనట్లు ఎస్సై రమేశ్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. వడ్రంగి వృత్తి పని చేసుకొని, జీవించే లక్ష్మీపతి సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు తెలిసినవారి ఇళ్లలో, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో మంగళవారం చందుర్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అదృశ్యం కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు 87126 56420, 70939 35167 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.



## అంజన్న వెండి ఎన్ని కిలోలు?

- ఆలయంలో ఉన్నదెంత? చోరీలో పోయిందెంత? వివరాలివ్వని ఈవో..
- నేటికీ కొండకు రాని దేవాదాయశాఖ విజిలెన్స్ అధికారులు


చోరీ జరిగిన అంజన్న అంతరాలయం

కొండగట్టు(చొప్పదండి): కొండగట్టు శ్రీఆంజనేయస్వామివారి అంతరాలయంలోకి బీదర్‌కు చెందిన దొంగలు గత నెల 24న చొరబడి వెండి వస్తువులు ఎత్తుకెళ్లారు. ఆలయ ఈవో వెంకటేశ్ రూ.9 లక్షల విలువైన 15 కిలోల వెండి పోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఇప్పటికే 17 కిలోల ఆభరణాలు పట్టుకున్నారు. అయితే చోరీ జరిగిన సమయంలో ఆలయంలో ఉన్న వెండి 37 కిలోలని అర్చకులు, 100 కిలోల వరకు ఉంటుందని కొందరు అధికారులు తెలిపారు. అసలు ఎంత ఉందన్న విషయమై ఈవోను వివరణ కోరగా తాను కార్యాలయంలో లేనని, హైదరాబాద్‌లో ఉన్నానని, ఎంత పోయిందన్నది ఆఫీస్‌కు వచ్చాక చెబుతానని బదులిచ్చారు. 15 కిలోలకు పైగా వెండి వస్తువులు పోయినట్లు గతంలో ఫిర్యాదు చేశామన్నారు. దొంగతనం జరిగితే ఈవో నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటివరకు అంజన్న కొండకు దేవాదాయ శాఖ విజిలెన్స్ అధికారులు రాకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు.

## గంగవ్వకు ఎమ్మెల్యే సీతక్క కానుక


ఎమ్మెల్యే సీతక్క పంపిన చీరను గంగవ్వకు అందిస్తున్న శేఖర్, నాయకులు

మల్యాల(చొప్పదండి): రాష్ట్రంలో బీఆర్ఎస్, కేంద్రంలో బీజేపీ పాలనలో అన్నివర్గాల ప్రజలు అన్యాయానికి గురయ్యారని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంట్ మాజీ అధ్యక్షుడు నాగి శేఖర్ అన్నారు. మై విలేజ్ షో, యూట్యూబర్ గంగవ్వకు ములుగు ఎమ్మెల్యే సీతక్క చీరను కానుకగా పంపించగా మంగళవారం ఆయన లంబాడిపల్లిలోని గంగవ్వ ఇంటికి వెళ్లి, అందించారు. అనంతరం ఆమెను శాలువాతో సన్మానించారు. మల్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగేళ్లలో ఎంపీగా బండి సంజయ్ చేసిన అభివృద్ధి పనులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మారంపల్లి లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు నాగి శేఖర్, నాయకులు మారంపల్లి గంగాధర్, సైదల అంజయ్య, ముద్దం శ్రీనివాస్, రామాంజనేయులు, హరినాథ్ సురేశ్, చందు, వినోద్, జితేందర్ పాల్గొన్నారు.

## కరెంటు షాక్‌తో రైతుకు తీవ్ర గాయాలు


చికిత్స పొందుతున్న రాయమల్లు

గొల్లపల్లి(ధర్మపురి): మండలంలోని మల్లన్నపేటకు చెందిన వాసం రాయమల్లు అనే రైతు విద్యుదాఘాతంతో తీవ్రంగా గాయపడ్డాడు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రాయమల్లు మల్లన్నపేట శివారులోని తన పంట పొలానికి నీరు పెట్టేందుకు మంగళవారం సాయంత్రం వెళ్లాడు. వ్యవసాయ మోటార్‌ను ఆన్ చేయగా విద్యుత్ సరఫరా కాలేదు. దీంతో సమీపంలోని త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లి, హ్యాండిల్‌ను ఆఫ్ చేసి, ఫీజ్ వైరు వేసేందుకు ట్రాన్స్‌ఫార్మర్ మీదకి ఎక్కాడు. అయితే ప్రమావశాత్తు కరెంటు షాక్ రావడంతో కిందపడి, తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కాగా మూడు రోజుల క్రితం ఫ్యూజ్‌వైరు పోయిందని రాయమల్లు జేఎల్ఎం మారుతికి సమాచారం ఇచ్చినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పొలం ఎండిపోతుందన్న దిగులుతో మరమ్మతుకు ఉపక్రమించి, ప్రాణం మీదకు తెచ్చుకున్నాడని కన్నీరు పెట్టుకున్నారు.

## అనాథ చిన్నారులకు చేయూత

- రూ.50 వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించిన వుయ్ హెల్ప్ యూ టీం


బాండ్లు అందిస్తున్న టీం సభ్యులు, మేనేజర్

ధర్మపురి: భక్తులు గోదావరిలో వేసిన డబ్బులను తల్లిదండ్రులు తీసుకువస్తేనే బతికే ఆ చిన్నారుల జీవితాల్లో చీకట్లు అలుముకున్నాయి. గతంలో తల్లి, 12 రోజుల క్రితం తండ్రి మృతి చెందడంతో అనాథలయ్యారు. వారికి వుయ్ హెల్ప్ యూ టీం సభ్యులు అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. ధర్మపురికి చెందిన పెంకర్ల కనకయ్య-పద్మ దంపతులకు కూతురు శిరీష, కుమారుడు హరీశ్ ఉన్నారు. ధర్మపురిలోని నక్కలపేట రూట్‌లో ఉన్న ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నారు. పిల్లలను పోషించేందుకు ఆ తల్లిదండ్రులు భక్తులు నిత్యం గోదావరిలో వేసిన డబ్బులను ఏరుకునేవారు. ఈ నేపథ్యంలో ఆ కుటుంబాన్ని విధి చిన్నచూపు చూసింది. కనకయ్య-పద్మ దంపతులిద్దరూ అనారోగ్యానికి గురయ్యారు. వైద్యం చేయించుకునే స్థోమత లేక పద్మ ఆరు నెలల క్రితం మృతి చెందింది. అప్పటినుంచి మనోవేదనకు గురవుతున్న కనకయ్య 12 రోజుల క్రితం చనిపోయాడు. అనాథలైన పిల్లల విషయాన్ని తెలుసుకున్న వుయ్ హెల్ప్ యూ టీం కన్వీనర్ గొల్లపెల్లి గణేశ్, సభ్యులు కోజ్జుల రాకేశ్, కార్తీక్‌లు మంగళవారం వారి ఇంటికి వెళ్లారు. రూ.50 వేలను పిల్లల పేరిట బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించి, సంబంధిత బాండ్లను మేనేజర్ వెంకటేశ్వర్లు చేతులమీదుగా అందజేశారు.

## నేటి నుంచి ఒంటిపూట బడులు

- ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహణ

కథలాపూర్(వేములవాడ): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ఈనెల 15 నుంచి ఒంటిపూట బడులు నిర్వహించాలని డీఈవో జగన్మోహన్‌రెడ్డి ఎంఈవోలు, హెచ్ఎంలకు ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 15 నుంచి విద్యాసంవత్సరం చివరి పనిదినం వరకు ఒంటిపూట తరగతులు నిర్వహించాలన్నారు. ఉదయం 8- మధ్యాహ్నం 12.30 వరకు తరగతులు నిర్వహించాలని, మధ్యాహ్నం 12.30 గంటలకు విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించి ఇంటికి పంపించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లు కలిపి 1,154 ఉండగా.. అన్నింటిలో పక్కాగా ఒంటిపూట అమలు చేయాలని స్పష్టం చేశారు.

**గ్రామీణ ప్రాంతాలకు రవాణా సౌకర్యం కరువు?**

ప్రభుత్వం ఒంటిపూట తరగతులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికి గ్రామీణ ప్రాంతాల్లో అమలవుతుందో లేదో అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు ఉపాధ్యాయులు పట్టణ ప్రాంతాల్లో నివాసం ఉంటూ గ్రామాల్లో విధులు నిర్వర్తించడానికి వస్తూ పోతుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో విధులు నిర్వర్తించే ఉపాధ్యాయుల్లో కొందరికి బైకులు ఉండగా.. మరికొందరికి రాకపోకలకు ఆర్టీసీ బస్సులే ఆధారం. ఉదయం 7.45 గంటలకు పాఠశాలకు చేరుకోవాల్సిన పరిస్థితి. ఉదయం గ్రామాలకు సరైన సమయంలో బస్సు సౌకర్యం లేకపోవడంలో వేళకు చేరుకోవడం కష్టమని, ఫలితంగా గ్రామీణ ప్రభుత్వ పాఠశాలల్లో ఒంటిపూట బడి సరిగా నిర్వహణ సాధ్యమవుతుందోలేదోనని తల్లిదండ్రుల్లో సందేహం నెలకొంది.

## ప్రేమ విఫలమైందని అబ్బాయి ఆత్మహత్య

ఎలిగేడు(పెద్దపల్లి): ప్రేమ విఫలమైందని మనస్తాపానికి గురై మండలకేంద్రానికి చెందిన ఓ అబ్బాయి (19) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి అబ్బాయి తల్లిదండ్రులు, సోదరి నాలుగు నెలలుగా కరీంనగర్‌లో నివసిస్తున్నారు. పది రోజుల క్రితం అబ్బాయి స్వగ్రామానికి వచ్చి తాత, నానమ్మతో కలిసి ఉంటూ.. కాట్నపల్లిలోని ఓ రైస్‌మిల్‌లో కూలీ పని చేసుకుంటున్నాడు. అతడికి కొంతకాలంగా బంధువుల అమ్మాయితో స్నేహం ఉంది. అది ప్రేమగా భావించిన అబ్బాయి.. అమ్మాయిని అడగగా ఆమె తిరస్కరించింది. దీంతో మనస్తాపానికి గురై ఉరేసుకున్నాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## చికిత్స పొందుతూ యువకుడు మృతి

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): తండ్రి మందలించాడని సుల్తానాబాద్ మున్సిపల్ పరిధి శాస్త్రీనగర్‌కు చెందిన మారవేణి అరవింద్(23) పురుగుల మందు తాగగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్ఐ ఉపేందర్‌రావు వివరాల ప్రకారం.. అరవింద్ డిగ్రీ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. ఖాళీగా ఎందుకు ఉండడం, వ్యవసాయ పనులకు రావాలని తండ్రి అంజయ్య మందలించినందుకు మనస్తాపం చెందాడు. ఆదివారం రాత్రి తమ పొలం వద్ద పురుగుల మందు తాగగా, కుటుంబీకులు గమనించి సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం మొదట కరీంనగర్, అక్కడినుంచి హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి తల్లి శంకరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట ఎస్ఐ తెలిపారు. కాగా అరవింద్ బీజేవైఎం పట్టణ అధ్యక్షుడిగా పని చేస్తుండగా, బీజేపీ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి, సానుభూతి తెలిపారు.